# మానవత

నిశీధిరాత్రి యెంతో భయంకరంగా వుంది. కుండ పోతగ వర్షం కురుస్తోంది. హోరుగాలి, అప్పుడప్పుడు విన్పించే కుక్కల అరుపులు ఆకాశంలో మెరుపులు, దిక్కులు పిక్కటిల్లే వురుముల మోతలు ... యెంతో భయంకరంగా వుందా రాత్రి-

షుమారు పన్నెండు గంటల సమయం :—శ్రీహరి గదిలో టేబిల్ లైటుముందు కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు. బుర్ర వేడెక్కిందన్పించటంతో సిగరెట్టు ముట్టించాడు.

మార్చి '66 కోమలిలో ప్రచురితము

తలుపుతట్టిన శబ్దమైంది. శ్రీహరికి అంతరాయం కలిగింది.

క్రితంకంటె మళ్ళీ గట్టిగా తలుపు కొట్టినశబ్దం వినిపించింది, లేచి వెళ్ళి తలుపు తీశాడు.

వణుకుతున్నట్లుగా ఓ ఆకారం తలుపు తోసుకు లోపలికి వచ్చింది. యెవరైంది అర్థంకాలేదు శ్రీహరికి.

"మీకు దణ్ణం పెడతాను. తలుపు వెయ్యండి" —అని ప్రాధేయపూర్వకంగా అడిగింది. స్త్రీకంఠమని తెలుసుకున్నాడు. అచేతనంగా తలుపు గడియవేసాడు.

కొంతసేపు ఇద్దరిమధ్య మాటల్లేవు.

ఆమె ఆయాసపడుతూ రొప్పుతున్నది. భయకంపితంగ వూపిరి సలపటం గమనించిన శ్రీహరి బహుశ ఆమె యెంతో దూరంనుండి పరుగెత్తుతూ వచ్చి వుండవచ్చని వూహించాడు.

వర్షంలో బాగా తడిసిందని గుర్తించిన శ్రీహరి "చూడండీ... ముందు ఈ టవలుతో తల తుడుచుకోండి!"- అందించాడు.

మళ్ళీ తలుపు తట్టిన శబ్దమైంది.

తలుపు తీయబోతున్న శ్రీహరి కాళ్ళను చుట్టేసింది ఆమె.

పరిస్థితేమిటో అర్థంచేసుకున్న శ్రీహరి కొద్దిక్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

మళ్ళీ తలుపు తట్టిన శబ్దం.

తలుపు తీశాడు శ్రీహరి—

"మిమ్మల్ని అర్ధరాత్రి సమయంలో "డిస్టర్బ" చేయవలసి వచ్చినందుకు క్షమించండి—అంటూ లోపలికొస్తున్న పోలీసు ఇనస్పెక్టర్‌ను యిద్దరు కానిస్టేబుల్సు అనుసరించారు.

" ఫర్వాలేదు కానీయండి... " ముక్తసరిగా చిరునవ్వుతో బదులు పలికాడు శ్రీహరి.

ఇంతరాత్రివరకూ మీరు లైటువేసుకొని గదిలో ఏం చేస్తున్నారు ?-?-" గంభీరమైన కంఠంతో అడిగాడు ఇనస్పెక్టర్.

"చాలా విచిత్రంగావుంది మీ ప్రశ్న! అయినా అడిగారు గనుక చెప్పడం నా విధి !—ఆఫీసుఫైల్సు చూస్తూ కూర్చున్నాను!— పైగ... నిద్రకూడా రావటంలేదు!—"
తడబడకుండా చెప్పాడు శ్రీహరి.

'అయితే చూడండీ!-ఇంతకు క్రితమే యెవరైనా ఒక స్త్రీ ఇటుపైపుగ వొచ్చిందా?'

ఇప్పటివరకు నేను తలుపు వేసుకునే వున్నాను!

'కనీసం అలికిడయినా కాలేదా ?'

"చూడండి ఇనస్పెక్టర్! అర్ధరాత్రీ పైగ వర్షం ధారాపాతంగా కురుస్తున్నందున నాకు యెలాంటి అలికిడిగానీ—శబ్దంగానీ—విన్పించలేదనే చెప్పాలి."

'ఆల్ రైట్!—థాంక్సు!—సారీఫర్ దిట్రబుల్ గివెన్' అనేసి వెళ్ళిపోయాడు.

యథాతథంగ తలుపు గడియవేసాడు శ్రీహరి.

అసలు పరిస్థితేమిటో అర్థంకాలేదు శ్రీహరికి.

ఇంతకూ ఆమె యెవరు?—పోలీసులెందుకు వచ్చినట్టు? ఈ రెండు ప్రశ్నలే శ్రీహరి మనస్సులో సంచలనం లేవదీసినయి.

మళ్ళీ సిగరెట్టు వెలిగిస్తూ భయంలేదు. ఇక బైటికి రండి! అన్నాడు.

ఆమె చూపుల్లో యింకా భయం కన్పిస్తూనేవుంది.

'చూడండీ! మరోలా అనుకోకపోతే మీ బట్టలు మార్చుకోండి. అలా బాత్‌రూంలోకి వెళ్ళి—నా షర్టు పంచ యిస్తాను!'— అంటూ ప్రక్కనేవున్న ట్రంకులోంచి బట్టలు తీసి యిచ్చాడు.

"ఇప్పటికే మీ సహాయానికెంతో ఋణపడ్డాను!—వర్షం తగ్గినట్టుంది యిక నేవెళ్తాను!

వెళ్తారా! యెక్కడికి!

"నా చోటికి—"

చూడండీ-విషయమేమిటో నాకు తెలీదు!-కానీ నేను వూహించినంతవరకూ, మీరు యేదో ఆపదలో వున్నారని మాత్రం చెప్పగలను?—కాబట్టి మీరు వెంటనే బైటికి వెళ్ళటం హానికరం?—అపార్థం చేసుకోనంటే నేనోసలహా యిస్తాను.

నిజమే.—మా జీవితమే అలాంటిది.—దానికి భగవంతుడుకూడా ఏమీ చేయలేడు—ఇప్పటికే మీకు చాలా శ్రమిచ్చాను.

"మరేం ఫర్వాలేదు ... మీ కొచ్చిన భయంకూడా ఏమీలేదు ... ఈ రాత్రికి మీరిక్కడే వుండటం మంచిదని నా అభిప్రాయం... అందుకు మీ అభ్యంతరం లేకపోతే."

"మీ మంచితనానికి నేనెంతో ఋణపడ్డాను!- కానీ నేవెళ్ళక తప్పదు."

"ఇంత రాత్రిసమయంలో మీరు వెళ్లి ఆపదను కోరి తెచ్చుకునేకంటె రేపు ఉదయాన్నే మిమ్ముల్ని భద్రంగా మీ చోటికి చేరుస్తాను —బాగా ఆలోచించుకోండి. ఇంత కూ మీ కొచ్చిన నష్టమేమిటి?"

హుం ప్రపంచంలో ఆడదిగ పుట్టడమనేదే సమస్య— తర్వాత జీవనాధారం కోసం ప్రాకులాడుతూ బ్రతకటమనేది మరోసమస్య.—అయినా నా బాధ చెప్పుకుంటే తీరేదిగాదు క్షమించండి—అంటూ ఆమె మాట్లాడుతున్న ప్రతి అక్షరం లో నిరాశ, నిస్పృహ యిమిడివున్నట్లు గ్రహించాడు శ్రీహరి.

"మీరలా అనవసరంగా మనస్సు కష్టపెట్టుకోవద్దు.- వెళ్ళి బట్టలు మార్చుకురండి ... తీరిగ్గా మాట్లాడుకోవచ్చు!" అని అనటంతో బాత్ రూమువైపు దారి తీసిందామె.

శ్రీహరి గొప్పయింటివాడు. తల్లి దండ్రులులేని శ్రీహ రిని మేనమామ పెంచి పెద్దచేసి, ఆస్థి వారసుల హస్తగతం కానీకుండా అణాపైసలతోసహా వప్పగించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో బిజినెస్ చేస్తున్నాడు.

ఉన్నతాదర్శాలుగలవ్యక్తి శ్రీహరి. ఎదుటివారి పరిస్థి తిని అర్థంజేసుకుని ఆదుకోగల సమర్థత సహృదయం గలవాడు.

ప్రస్తుతంలో స్త్రీ నైతికపతనాన్ని చూచి జాలిపడతాడు. సంఘంలో స్త్రీ విలువను, గౌరవాన్ని ... వృద్ధిజేయటానికి శాయశక్తులా పాటుపడతాడు. అవసరమైతే యెలాంటి త్యాగమైనా సరే చేసేందుకు వెనుదీయడు. మానవత్వాన్నీ, నిజాయితీని నిలబెట్టాలనే అభిలాష అతనిలో యెక్కువ.

రెండవ ఆట సినిమాజనం గుంపులు గుంపులుగా రోడ్డుమీద వెళ్తున్నట్లు కిటికీలోంచి గమనించాడు శ్రీహరి.

వాతావరణంలో మార్పొచ్చింది.

ఆకాశాన్ని నమిలి మింగేద్దామన్నంతగ దట్టంగా అల్లుకున్న మేఘాలు యెక్కడి వక్కడ చెల్లాచెదురవటంతో నీలాంబరాన తారకలు కన్పిస్తున్నయ్.

తీవ్రంగా ఆలోచిస్తున్న శ్రీహరి సిగరెట్టుమీద సిగరెట్టు వెలిగిస్తున్నాడు.

పొడిబట్టలు కట్టుకుని బాత్‌రూంలోంచి వస్తూ 'నాకు ఈ బట్టలు వేసుకుంటే సిగ్గుగా వుందండీ!" అన్నది.

"కాస్సేపు... మీరు మగవాళ్లే ననుకోండి... పోయేదేముంది?'

"అంత అదృష్టంగూడానా? ... ఆడదై పుట్టేకన్నా దురదృష్టం వేరొకటుండదు?"

"జీవితంమీద, మీకెందుకంత, నిరుత్సాహం కలిగింది.?"

"కారణాలు చాలావున్నయి. నిజం చెప్పలేను."

"అబద్ధాన్ని చెప్పినందువల్ల యిప్పుడు మీకొచ్చే లాభం ఏమీలేదు—అసలు విషయమేమిటో చెప్తే చేతనైన సాయం చేస్తాను !- సందేహించవద్దు. ఇంతకూ మీపేరు !"

"మాలతి !"

"ఎంత చక్కని పేరు—చదువుతున్నారా ?"

"అంతటి అదృష్టం నాకుంటే... ఈనాడు నా బ్రతుకు బాటలో యిన్ని అవాంతరాలు వచ్చివుండేవిగావు."

"అంటే... మీ ఉద్దేశ్యం ?"

"బ్రతకాలనీ ఆశ !—కానీ గౌరవంగా బ్రతికే అదృష్టానికి నోచుకోలేదు !-" ఆమె కంటిలో నీరునిండింది.

"నేను మీకు చేయగల సహాయం ఏమీలేదని మీకు అనిపించినా, కనీసం మీ పరిస్థితి యెలాంటిదో... అదైనా చెప్తే మీకు కొంత మనశ్శాంతిని కలిగిస్తుంది !"

"మసిపికోవిధమైన కథ చెప్పటానికి అలవాటు పడ్డాను, ఇప్పుడు నిజాన్ని చెప్పాలనే అన్పిస్తోంది. యెందుకో... కాని నాకెన్ని పేర్లున్నయో... నాకే తెలీదు!— తలావొక పేరున పిలుస్తారు— నా జీవితకథనం అలా తయారైంది! గతాన్ని జ్ఞాపకం చేసుకోలేను, ప్రస్తుతాన్ని దాచే ధైర్యమూలేదు."

"అయినా యింత అర్థరాత్రి మీరిలా యెందుకు రావల్సివచ్చింది ?"

"పగవారికూడా వద్దు మాబాధలు!—బ్రతుకుమీద అసహ్యం వేస్తున్నది—కానీ—కోరి చావును తెచ్చుకోనూ లేను—ఏ క్షణంలో ఏమౌస్తుందోని ప్రతినిత్యం భయపడుతూ వుంటాను... ఏవిధంగా తెల్లవారుతుందాని ప్రాణాలు చిక్కబట్టుకుని రోజులు గడపడంకన్నా గత్యంతరం కన్పించటము లేదు."

"ఇంతకూ... పోలీసులు మిమ్మల్ని యెందుకలా వెంబడించినట్టు ?"

"చేస్తున్న పాపానికి ప్రాయశ్చిత్తంగా పదిరోజుల కోమారు మమ్ముల్ని పట్టుకునేందుకై వస్తారు. చిక్కినవారికి శిక్ష !- తప్పించుకున్నవాళ్ళకు మరికొన్నిరోజులు జీవనోపాధి గడుస్తుంది..."

"పాపం... అయితే నీకు నాఅనేవారెవ్వరూ లేరా!"

"ఒకప్పుడున్నారు... కానీ ప్రస్తుతంలో నాదగ్గరకొచ్చే వారంతా నావాళ్ళే..."

"అంటే...?"

'అంటే—' భోరుమని ఏడ్చింది.

"ప్రశ్నమీద ప్రశ్నవేసి నిన్ను నొప్పిస్తున్నానుగదూ! అయినా నీజీవితకథనం తెల్సుకోవాలని వుంది. చెప్పు ఫర్వాలేదు."

'ఏంచెప్పేది? ఏమని చెప్పేది? నలుగురొచ్చిన రోజున నాలుగు డబ్బులుంటయ్, అదిలేనినాడు పస్తులుండాల్సి వస్తుంది! సంపాదనలో సగం మా యజమానికే పోతుంది! మిగతా సగంమాత్రమే మా జీవనోపాధికి మిగిలేది. శరీరాన్ని అమ్ముకున్న తర్వాత, జీవితం యాంత్రికంగా సాగిపోతున్నది! నా మీద హక్కు నాకులేదు! యెందరో అధికారం చెలాయిస్తారు. ఫలితంగా డబ్బు ముఖాన విసిరేస్తారు."

'మాలతీ! - అసలెందుకు యిలాంటి పరిస్థితికి రావల్సి వచ్చింది!"

'గతాన్ని తల్చుకుంటే భయంవేస్తుంది. మావాళ్ళకు నేనొక్కదాన్నే ఆడపిల్లను. అప్పుడు నాకు పద్దెనిమిదేళ్లు. మాది విజయవాడ దగ్గరే మరోవూరు. అనుకోనట్టుగా ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడ్డది. నన్ను ప్రేమించానన్నాడు, పెళ్ళి చేసుకుంటానన్నాడు. నమ్మేను. అమ్మా, నాన్నకు యిష్టంలేదన్న సంగతి తెలిసి అతనితో హైదరాబాద్ వచ్చాను. ఈవూరు నా కసలే క్రొత్త! పట్టుమని పదిరోజులు నన్ననుభవించి అతనెక్కడికో వెళ్ళిపోయాడు. నాలుగు రోజుల తర్వాత హోటలువాడు నన్ను బైటికెళ్ళిపొమ్మ న్నాడు– జీవనాధారం కష్టమైంది. ఇంటికి తిరిగి వెళ్ళేందుకు ముఖం చెల్లలేదు. చేసేదిలేక రోడ్డుమీదికొచ్చి రిక్షా యెక్కాను. రిక్షావాడు నన్ను యెన్నో ప్రశ్నలు వేశాడు.నా పరిస్థితేమిటో నాకు అర్థం కాలేదు. రిక్షా ఓయింటి ముందా గింది! లోపలికెళ్ళాను. ఓ నలభై ఏళ్ళ ఆడమనిషి కుర్చీలో కూర్చొనుంది. నేనెక్కడికి వచ్చానని అడిగాను. అనాథ శర ణాలయానికి కొచ్చానని చెప్పిందామె. ఆమె ఆ రిక్షావాడికి డబ్బులిచ్చి పంపేసింది. సగం సంతోషించాను. నాలాంటి మరోకొంతమంది వున్నారని తర్వాత తెలిసింది. కొన్ని రోజులు అర్థానందంతో గడిచాయి."

"ఆ ఆతర్వాత?" ఆదుర్దాతో అడిగాడు శ్రీహరి.

"తర్వాత... తర్వాత నాకు తెలిసింది ఆమె మనుష్యు లను చేరదీసి తార్చి డబ్బు సంపాదిస్తుందని. అందుకు నేను వప్పుకోనందుకు నిర్బంధించింది. అన్నం పెట్టకుండా ఓగదిలో

పడేసి చావగొట్టేది. మనిషిని నిరసించి పోయాను. జీవితం మీద విరక్తి కలిగింది. దానికి ఫలితంగా ఆమె నామీద అధికారాన్ని హస్తగతం జేసుకుంది. నన్ను ఆమె చేరదీయటంలో అంతరార్థం తెలుసుకునేసరికి నా పరిస్థితి చేయిదాటి పోయింది.

'మాలతీ నిన్ను చూస్తుంటే జాలివేస్తున్నది."

"గానీ నా బ్రతుకుమీద నాకే అసహ్యమేస్తోంది.'

'బాధపడి ప్రయోజన మేముంది? తప్పు నీదికాదు. అప్పట్లో నీ పరిస్థితి అలాంటిది, నువ్వుమాత్రం ఏంచేస్తావు'

కోడికూత విన్పించింది.

తెల్లవారవస్తోంది

గడియారం ఐదుగంటలు కొట్టింది.

ఇవిగో మీ బట్టలు. యిక నే వెళ్ళొస్తాను. తెల్లవారవచ్చేట్టుంది. మీ మేలు మర్చిపోలేను.

"ఎక్కడికి కెళ్తావు మాలతీ?"

"నా చోటికి ! తప్పేముంది."

'మాలతీ ! ఒక్కక్షణం ఆలోచించు, చేసిన పాపానికి పశ్చాత్తాపం కంటే ప్రాయశ్చిత్తం లేదు. తోటివారు క్షమించకపోయినా, భగవంతుడు నిన్ను తప్పక క్షమిస్తాడు. మళ్ళీ నరకంలోకి ఎందుకు కాలుబెడతావు ? నామాటవిను."

"బాగుందండీ! వెళ్ళకపోతే జరుగుబాటు అయేదెట్లు?"

"ఎంత అమాయకంగా ప్రశ్నించావ్ మాలతీ ? బ్రతికేందుకు అంతకన్నా మార్గాలే లేవా ?"

"ఎంతో మంచిమనసు మీది. కానీ, నాలాంటివారు గౌరవంగా జీవితం వెళ్ళబోసుకోవటమనేది సాధ్యంకాదు. ఎవ్వరూ పాపం తల్చరు."

"అవేం పిచ్చిమాటలు మాలతీ. సమాజందృష్టిలో నువ్వు పతితవుగావచ్చు కానీ, వ్యక్తిగతంగా నీ అభిప్రాయం నీకెప్పుడోవుంది. దాన్ని కాదనే అధికారం యెవ్వరికీలేదు. నిర్ణయాలను మార్చుకునేశక్తి ఒక్క మానవులకే వుంది. భవిష్యత్తునుపునర్నిర్మాణం చేసుకోవటంలోనేవుంది మానవత్వం. ఏమంటావ్ ?"

"మీరెంతో చదువుకున్నవారు. డబ్బున్నవారు. నేనెవరో ? మీరెవరో ? నామీద యెందుకింత జాలి !"

"జాలిగాదు మాలతీ సానుభూతి. యెదుటివారి దుస్థితి చూసి చేతనైన సాయంచేయటం మానవధర్మం ?"

"మీలాంటి అభిప్రాయాలు చాలా కొద్దిమందికే వుంటాయి."

"మాలతీ! మళ్ళీ నిన్నొక మనిషిని చేయాలనే ఆశ, నీ జీవితకథనం విన్నప్పటినుండి నాలో కలిగింది."

"మీమాటలు నాకర్థంకావడంలేదు."

"చూడుమాలతీ! నిన్నుమళ్ళీ ఈ పాపిష్టిలోకంలోకి పంపించాలంటే నాకు మనస్కరించటంలేదు. కానీ నిన్నొక్కటడగాలనుంది."

సిగ్గుతో తల వంచుకుంది.

"నేను ఒంటరివాడిని, కావలసినంత ఆస్తివుంది. అలాంటి నేను నీకు ఆశ్రయమివ్వాలని వుంది. నువ్వూ నాకు అండగా వుంటావ్. నేనూ నీకు తోడుగా వుంటాను, ఏమంటావ్ ?"

"క్షమించండి! నాజీవితం ఒక పాపాలపుట్ట. నేనెలాగూ నాశనమైపోయాను. మీలాంటివారి పంచనవుండే అర్హత కూడా నాకులేదు. అలాంటి నేను మీ గౌరవ మర్యాదలకు అప్రతిష్ట తేలేను."

"అదే పొరపాటు మాలతీ! గౌరవమర్యాదలు సమాజంలో మనం సృష్టించుకున్నవి మాత్రమే. వాటిమీద నాకెన్నడూ వ్యామోహంలేదు. ఇకపోతే నీకథ విన్నప్పటినుండీ నీమీద జాలి, అంతఃకరణ నాలో కలిగాయి. నిన్ను మళ్ళీ మనిషినిచేయాలనీ, సమాజంలో నీకు సవ్యమైన జీవనోపాధి కల్పించాలనీ, నీ జీవితాన్ని తిరిగి మళ్ళీ చిగురింపజేయాలనీ నా ఆశ. నామాట కాదనేవారెవ్వరూలేరు. నువ్వుమాత్రం నన్ను హృదయపూర్వకంగా నమ్మితేచాలు అదే నాక్కావలసింది!"

"మీరీవిషయంలో తొందరపడుతున్నారేమోని అన్పిస్తోంది. మీ నిర్ణయం సరియైనదికాదని తర్వాత తెలిస్తే నా జీవితం మళ్ళీ ఏంకాను? అర్థోక్తిగ ఆగిపోయింది."

"ఆ భయం నీకక్కర్లేదు. ఆత్మవిశ్వాసం నాలో ఎప్పుడూవుంది. మనస్థైర్యాన్ని కోల్పోతాననేభయం నాకు లేదు. నాబాధల్లా సమాజములో నువ్వు ఒక మనిషివి కావాలి, నీలో కొత్త రూపురేఖలను తీర్చి దిద్దాలి. అదే నా ఆశయం. ఏమంటావు ?"

"ఏమిటో మిమ్ములను వంచిస్తున్నానేమోనని భయముగావుంది."

"పొరపాటు. నీపరిస్థితి నీచేత అట్లాఅన్పిస్తున్నది. అంతే. కా , నీనుండి నేకోరేది నీ తుదినిర్ణయం. నీగతాన్ని నేను విమర్శించను. ఆ హక్కు, అధికారం నాకు లేదు. ఉజ్వలమైన నీభవిష్యత్ మాత్రమే నాక్కావాలి, అది నీకూ మంచిది. సమాజంలో సరికొత్త మాలతి, నీలో రూపం పోసుకుంటుంది! ఏం మాలతీ! నామీద నీకింకా నమ్మకం కుదరటం లేదా ?"

మౌనంగా వుండిపోయింది మాలతి. అంగీకారసూచనగ ఆమె వదనంలో సరికొత్త ఆశాకిరణం నవ్యరూపాన్ని ధరించబోతున్నట్లు నిండుగ నవ్వింది."